నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' ఆర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రజలు 08562-2444 37 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెరిగిన బొప్పాయి సాగు

రైతన్నకు సిరులు - అధిక విస్తీర్ణంలో సాగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఒకప్పుడు పెరటి మొక్కగా ఉన్న బొప్పాయి, తైవాన్ రకాల రాకతో తోటలను సంతరించుకుంది. దీనిసాగు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో బొప్పాయి సాగు విస్తీర్ణం 70వేల ఎకరాలకు పైగా ఉంది. ఒకప్పుడు ఇంటి పెరట్లోనో, పొలం గట్లపైనో ఉన్న బొప్పాయికి ఇంతగా ప్రాధాన్యం పెరగటానికి ప్రధాన కారణం అధిక దిగుబడినిచ్చే తైవాన్ రకాలే అని చెప్పక తప్పదు. దీనికితోడు రిటైల్ మార్కెట్లు, సూపర్ మార్కెట్ల రాకతో దీనిసాగు వాణిజ్యరూపును సంతరించుకుంది. ప్రస్తుతం బొప్పాయి అన్ని సీజన్‌లలో అందుబాటులో ఉండే పండు, ఇతర పండ్లతో పోలిస్తే బొప్పాయిలో కెరోటిన్ అత్యధికంగా ఉంది. విటమిన్లు పుష్కలంగా లభ్యం కావటం, ఆరోగ్యానికి మేలుచేసే వివిధ ఔషధ గుణాలు మెండుగా ఉండడం వల్ల బొప్పాయిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఇప్పుడు దీని వాడకం విస్తృతమవటం, మార్కెట్ డిమాండ్ పెరగటంతో రైతుకు బొప్పాయి సాగు లాభదాయకంగా మారింది. సాధారణ బొప్పాయి రకాలకంటే, తైవాన్, సంకర రకాలు 2 నుంచి 3 రెట్లు అధిక దిగుబడినిస్తుండటంతో బొప్పాయిసాగు మరింతగా విస్తరిస్తోంది. ముఖ్యంగా తైవాన్ రెడ్ లేడీ రకం మొక్కలు పొట్టిగా ఉండటం, పెనుగాలుల తాకిడిని తట్టుకునే స్వభావం ఉండటంతో రైతులకు సాగులో సమస్యలు చాలా వరకు తగ్గుతాయని రైతులంటున్నారు. సాధారణంగా బొప్పాయి నాటిన 9వ నెల నుండి దిగుబడి ప్రారంభమై, మంచి యాజమాన్యం పాటించిన తోటల్లో రెండున్నర సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల వరకు దిగుబడులనిస్తుంది. ముఖ్యంగా బొప్పాయి కోతలు అనేది మనం ఎంచుకున్న రకం, పంపే మార్కెట్లదూరం పైన ఆధారపడి వుంటుంది. లోకల్ మార్కట్లకే కాక ఢిల్లీ, ముంబాయి వంటి ప్రధాన మార్కెట్లను దృష్టిలో ఉంచుకుని, అందుకు తగ్గట్టుగా పంట దిగుబడులు తీస్తున్నారు కొందరు రైతులు. పంపే మార్కెట్ ఏదయినా కోతల సమయంలో కొన్ని మెలకువలు తప్పనిసరి. సాధారణంగా, వినియోగదారులు మధ్యస్థ సైజులో ఉన్న కాయలను ఎక్కువగా ఇష్టపడతారు. కాబట్టి చెట్లపై కాయలు తగిన పరిమాణం రాగానే కోతలు చేయాలని, పూర్తిగా చెట్లపైనే కాయలు పండనీయ కూడదని రైతులు చెబుతున్నారు. ఈపంట సాగులో దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నా, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తెగుళ్ళు. వీటిని సమగ్ర సస్యరక్షణ చర్యలతో అరికడుతూ, ఎకరానికి 100 టన్నుల దిగుబడులు సాధించిన రైతులూ ఉన్నారు. బొప్పాయిని సాగు చేయటం పైనే కాదు, కోతల అనంతరం కూడా సరైన మెలకువలు పాటించినప్పుడే మంచి రాబడి వస్తుందని రైతులంటున్నారు.

మార్కెట్‌కు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

దూరపు మార్కెట్లకు పంపేటప్పుడు, కాయలపై ఆకుపచ్చ రంగు నుంచి 1,2 పసుపు చారలు రాగానే, కాయలు కోసుకోవాలి. అదే దగ్గరి మార్కెట్లకు పంపేటపుడు కొంచెం మాగిన కాయలను కోసినా సరిపోతుంది. కాయలను కోసిన తర్వాత వాటినుంచి వచ్చే పాలు ఆరిపోయే వరకు నీడలో ఆరబెట్టాలి. లేదంటే కాయలపై మచ్చలుగా ఏర్పడి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఇలా పూర్తిగా ఆరిన కాయలను ప్యాకింగ్ చేసుకోవాలి.

- చెన్న కృష్ణారెడ్డి, రైతు, లింగాల.

అనుకూలమైన రకాలతో మంచి దిగుబడి

రెడ్ లేడీ, వాషింగ్టన్, కో 1,2,3 రకాలు అనువైనవి. ఒక ఎకరాకు 1000 మొక్కలు నాటాలి. మొక్కలు నాటే సమయంలో గుంతల్లో ప్రతి గుంతకూ పశువుల ఎరువు, 20 గ్రాముల అజోస్పైరిల్లమ్, 20 గ్రాముల ఫాస్ఫో బాక్టీ రియా, 40 గ్రా ముల మైకోరైజాను బాగా కలు పుకొని వేసుకోవాలి. నాటే సమయం జూన్, జులై, అక్టోబర్, నవంబర్ మాసాల్లో నాటుకోవచ్చు. 40 నుంచి 60 రోజుల వయస్సున్న 15 సెంటీమీటర్ల పొడవు గల మొక్కలను సాయంత్రం సమయంలో నాటుకోవాలి.

- మహేశ్వర్ రెడ్డి, రైతు, పులివెందుల.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు

బొప్పాయిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చు. ప్రకృతి సాగు చేయడం వల్ల కాయలు బరువుగా నాణ్యత కలిగి ఉంటాయి. వేసవిలో కూడా బెట్టకు రాకుండా అధిక దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం టన్ను రూ.22 వేల వరకు పలుకుతుంది. మార్కెట్లో కిలో బొప్పాయి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ లేని సమయంలో కూడా టన్ను రూ.12 నుంచి 15 వేలు ధర పలుకుతుంది.

- జనార్దన్‌రెడ్డి, రైతు, పులివెందుల.

బూడిద తెగుళ్లు నివారిస్తే మంచి దిగుబడి

బొప్పాయి పంటకి ఎక్కువగా ఆకు మీద నల్లని మచ్చ కలిగిన బూడిద తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. దీనికి తడి సల్ఫర్, సల్ఫర్ డస్ట్, లేదా లైం సల్ఫర్, పొటాషియం బైకార్బోనేట్ వంటివి వ్యాధిని నియంత్రించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. కానీ అధిక వేడి వాతావరణంలో వీటిని వాడటం వల్ల మొక్కలపై విషపూరిత ప్రభావం చూపిస్తుంది. కొన్ని పరిస్థితులలో బేకింగ్ సోడా, వేప నూనె, సబ్బు ద్రవాలు కూడా వాడవచ్చు. వ్యాధి తీవ్రత అధికంగా చూసుకుంటే మంచిది.

- రాఘవేంద్ర రెడ్డి, ఉద్యానవన అధికారి.

రుగ్మతలపై రచయితలు కలం ఎక్కుపెట్టాలి

- శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానందరావు

మాట్లాడుతున్న నిత్యానందరావు

ప్రజాశక్తి- కడప అర్బన్

సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ అభివృద్ధి దిశగా ప్రజలను సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానందరావు అన్నారు. కడప నగరంలోని ఐఎంఎ హాల్లో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'వెయ్యేళ్లతెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం' అనే శీర్షికతో 2వ సాహిత్య సాంస్కృతిక మహాసభలను ఆదివారం సభను కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రసంగిస్తూ సాహిత్య సంఘాలు ప్రజల్లో సాహితీ పిపాసను పెంచాలని, ప్రాంతీయ అభివృద్ధి నిమిత్తం చైతన్య స్పృహ రేకెత్తించాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులకు సరైన మార్గనిర్దేశం చేయడానికి మరింత ఉత్సాహంతో సానుకూల దృక్పథంతో సాహిత్య సంఘాలు కృషి చేయాలని పేర్కొన్నారు. సభాధ్యక్షులు, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వాన్ని చాటిచెప్పేలా ఈ రెండు రోజుల మహా సభలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. రాయలసీమకు చెందిన భాష, చరిత్ర, సాహిత్యం, సంస్కృతి అంశాలపై అనేక పరిశోధన పత్రాలు, సదస్సుల ద్వారా వెలుగు చూశాయన్నారు. విశిష్ట అతిథి, సంఘం గౌరవ సలహాదారులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పేరుకు రాయలసీమ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి కూడా కవులు, కళాకారులు పాల్గొనడం, రాయలసీమ ఘనతను చాటడం హర్షణీయమన్నారు. సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్రెడ్డి స్వాగతం పలుకగా సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. శతాధిక కవి సమ్మేళనంలో కవులు కవితాగానం చేశారు. సంఘం కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి సభా సమన్వయం చేశారు. రాయలసీమ పత్రికా రంగంపై డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, రాయలసీమ సినిమాపై భూమిరెడ్డి స్వరూపరాణి, రాయలసీమ సంస్కృతి, సంప్రదాయాలు అనే అంశంపై పుట్టా ఓబులేసు పత్రాలను సమర్పించారు. వేమన, సుమతి, భాస్కర శతకాలలో పద్యపఠన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న బైరవప్రసాద్

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన)

కార్మికులకు, అసంకటిత కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ భైరవ ప్రసాద్ పేర్కొన్నారు ఆదివారం పోరుమామిళ్లలోని వివేకానంద భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో పోరుమామిళ్ళ ప్రయివేట్ ఎలక్ట్రిషియన్ వర్కర్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు లబ్ధి పొందేందుకు వెంటనే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన గుర్తింపు కార్డులను ప్రతి సంవత్సరమూ రెన్యువల్ చేయించుకోవాలని అన్నారు. ప్రయివేట్ ఎలక్ట్రిషియన్లు పోరుమామిళ్లలో పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారు ప్రమాద బీమా సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. ప్రభుత్వం కార్మికులకు పూచీ కత్తిలేని సబ్సిడీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఐటిఐ ఎలక్ట్రికల్ కోర్సు చేసి పట్టా పొందిన వారికి ప్రభుత్వం వెంటనే సబ్ స్టేషన్ లో ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్మికునికి ప్రమాద భృతి కింద రోజుకు రూ.800 చొప్పున గరిష్ఠంగా 15 రోజులు పాటురూ. 12000 చొప్పున ఆర్థిక సహాయం ఇవ్వాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా రూ. 10 లక్షలకు పెంచాలన్నారు. సాధారణ మరణం చెందిన కార్మికునికి రూ. 5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చులకు రూ. లక్ష ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల ప్రయివేట్ ఎలక్ట్రిషియన్ వర్కర్స్ యూనియం నూనత కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా షేక్ బాబు వలి, కో- కన్వీన ర్లుగా కిరణ్‌బాషా, హుస్సేన్ పీరా, సూరిబాబు, రఫీ, మల్లికార్జున, ఇమ్రాన్, హుస్సేన్ పీరా, మస్తాన్‌బాషా, అల్లా మాలిక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు ప్రయివేట్ ఎలక్ట్రిషియన్ ప్రధాన కార్యదర్శి రఫీ, కార్మికులు పాల్గొన్నారు.

జైమిని భారతం గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం మహాసభలలో పుత్తా పుల్లారెడ్డి రచించిన జైమిని భారతం శ్రీ లలితానందినీ వ్యాఖ్య గ్రంథాన్ని ఆదివారం అతిథులు అవిష్కరించారు. పుత్తా (బత్తిన) లలిత గ్రంథాన్ని స్వీకరించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'జైమిని భారతం – శ్రీ లలితా నందిని వ్యాఖ్య' అనే బృహత్ గ్రంథాన్ని రూపొందించిన పుత్తా పుల్లారెడ్డి అభినందనీయులన్నారు. ఈ గ్రంథంలో ఉన్న విషయాలను నేటి సమాజంలోని మనమంతా అన్వయించుకుని అనుసరించాలన్నారు. వ్యాఖ్యానం సులభశైలిలో అందరికీ అర్థమయ్యేరీతిగా రచించడం రచయిత ఔన్నత్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు కొంపెల్ల రామసూర్యనారాయణ వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి , పుత్తా పుల్లారెడ్డి కుటుంబ సభ్యులు, సాహితీప్రియులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లల ఆరోగ్యవంతమైన జీవనం కోసం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈనెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు, కౌమారులలో నులిపురుగుల సమస్యను అధిగమించడానికి ఈనెల 10న 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ' నిర్వహిస్తారన్నారు. 01 నుంచి 02 సంవత్సరాలలోపు పిల్లలకు 200 మిల్లీ గ్రాములు, 03 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు 'ఆల్బెండజోల్' 400 మిల్లీ గ్రాములు మాత్రలు పాఠశాలలు ,కళాశాలలు అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం తరువాత వేయాలని పేర్కొన్నారు. నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా కడుపులోని నులిపురుగులు తగ్గిపోతాయన్నారు. వీటిని నిర్మూలించడం వల్ల రక్తహీనతను నియంత్రణలోకి వస్తుందన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎపిటిఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన 11వ పిఆర్‌సి బకాయిలను, కరువుబత్యం బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు కరువుబత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గురయ్య, జిల్లా కౌన్సిలర్లు నరసింహులు, రామసుధాకర్ రెడ్డి, బాబు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేయాలని వినతి

ప్రజాశక్తి-కాశినాయన: మండలంలోని గంగనపల్లి నుంచి వరికుంట్ల చెరువు వరకు గత ప్రభుత్వంలో నిలిచిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తిచేయాలని ఆదివారం బద్వేల్ టిడిపి కార్యాలయానికి విచ్చేసిన కడప ఇన్‌ఛార్జి మంత్రి సవితకు నియోజవర్గ టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డితో కలసి మండల టిడిపి నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి వినతి పత్రం అందించారు. బాలాయపల్లె వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయడంతో పాటు, మండలంలో ఎస్‌సి బాలుర హాస్టల్ మంజూరు చేయాలని కోరమన్నారు. మండలంలోని పలు సమస్యలను ఆమెకు వివరించామన్నారు నియోజవర్గంలో కాశినాయన మండలం వెనుకబడిందని, ఈ మండలాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరామని తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరు టిడిపి నాయకులు పోలిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞత అర్పణ పండుగ

ప్రజాశక్తి - కడప : కడప నగరంలోని సిఎస్ఐ సెంట్రల్ చర్చ్ లో ఆదివారం కృతజ్ఞత అర్పణ పండుగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విమెన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ సి.డి. భారతి ఐజాక్ వర ప్రసాద్, పాస్టర్ పద్మావిక్టర్ రాజు, వైస్ ప్రెసిడెంట్. స్వరూపరాజన్న, అసిస్టెంట్ సెక్రెటరీ జంబారాపు రాజమణి రాజు, ట్రెజరర్ కల్యాణి విజయకుమార్, స్త్రీల మైత్రి సభ్యులు పాల్గొనారు.

బిందుసేద్యంతో అధిక దిగుబడులు

ఎస్‌సి, ఎస్‌టిలకు 90 శాతం సబ్సిడీ
డ్రిప్ ఇరిగేషన్ మెటీరియల్ సరఫరాలోనూ పురోగతి
ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బిందుసేద్యం అధిక దిగబడులకు చిరునామాగా నిలిచింది. ఫలితంగా సూక్ష్మసేద్యానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఇందులోభాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాం. అర్హులైన రైతుల్లో 80 శాతం మందికిపైగా పరికరాలను సైతం అందించడమైంది. ఏడేళ్ల కిందటి నుంచి జిల్లాలోని 36 మండలాల్లో 65 వేల హెక్టార్లలో బిందుసేద్యం ద్వారా పంటలను సాగు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోని పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లోనూ బిందుసేద్యం పెద్దఎత్తున సాగవుతోందని పేర్కొంటున్న ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

బిందుసేద్యం పురోగతి ఎలా ఉంది?

2024-25 ఆర్థిక సంవత్సరంలో13 వేల ఎకరాల్లో బిందు సేద్యం చేయడమే లక్ష్యం. ఇందులోభాగంగా ఇప్పటికి 8,250 ఎక రాలకు బిందుసేద్యం చేయడానికి సంబంధించిన అనుమతుల కసరత్తును పూర్తి చేశాం. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి మరో ఐదు వేల నుంచి ఏడు వేల ఎకరాలకు బిందుసేద్యం సదుపాయం అందించే అవకాశం ఉంది.

స్ప్రింకర్ల సాగు తీరుతెన్నుల్ని వివరించండి?

జిల్లాలో స్ప్రింక్లర్ల సాగు లక్ష్యం 2,000 హెక్టార్లు. ఇందులో భాగంగా 1,720 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 2,187 హెక్టార్లలో సాగుకు అవకాశం ఉంది. ఇందులో 563 దరఖాస్తులకు 689 హెక్టార్లలో సాగుకు అవకాశం ఉంది. బిందు, స్ప్రింకర్ల సాగు మొత్తా న్ని పరిశీలిస్తే 15 వేల హెక్టార్ల సాగు లక్ష్యానికిగానూ ఇప్పటికి 8, 250 హెక్టార్లలో సాగుకు దరఖాస్తులు వచ్చాయి. 2025 మార్చి నెలాఖరు నాటికి 13 వేల హెక్టార్ల నుంచి 15 వేల హెక్టార్లలో సాగు చేయడానికి అవకాశం ఉంది.

దరఖాస్తుల వివరాలు తెలపండి?

6,039 దరఖాస్తులను స్వీకరించాం. ఈమేరకు 6,988 హెక్టార్లలో సాగు చేయడానికి అవకాశం ఉంది. ఇందులో 17,880 మంది రైతులు 22,215 హెక్టార్లలో ప్రాథమిక సర్వే చేశాం. ఇందులో 6,039 మంది 6,988 హెక్టార్లకుగానూ ఎస్టిమేషన్ వేయడమైంది.

సబ్సిడీ వివరాలను తెలపండి?

బిందుసేద్య పరికరాలకు సబ్సిడీ వరిస్తుంది. ఇందులో ఐదె కరాలు లోపు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 90 శాతం, 10 ఎకరాలు కలిగిన మిగిలిన అన్ని కేటగిరీల రైతులకు 70 శాతం చొప్పు న సబ్సిడీ వర్తిస్తోంది.

డ్రిప్ ఇరిగేషన్ కేటాయింపు విధానాన్ని తెలపండి?

ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ప్రాంత ఆర్‌బికె అధికారులు మొదటగా ప్రాథమిక సర్వే, బయోక్యూ చేసి అర్హమైన రైతులకు సిరఫాసు చేయడం తప్పనిసరి. వీటిని ఎపి ఎంఐపి పీడీ 10 శాతం, ఎపిడి 10 శాతం, హార్టీకల్చర్ అధికారు లు 20 శాతం, ఎంఐఎస్‌హెచ్‌జి 10 శాతం, ఆర్‌బికె ఇన్‌ఛార్జులు 10 శాతం చొప్పున క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారించడం జరుగుతుంది.

బిందుసేద్యం ఆదరణకు గల కారణాలేమిటి?

కరువు పీడిత ప్రాంతాలు కావడం, నాణ్యమైన దిగుబడు లకు అవకాశం ఏర్పడడం, కలుపు ఖర్చులు కలిసి రావడం తెలిసిందే. దీనికితోడు నీటి ఆదా, ఎరువుల వినియోగ పరిమాణం, విద్యుత్ బిల్లుల్లో తగ్గుదల వంటి అదనపు సౌలభ్యాలు కలిసి రావడం కారణ మని తెలుస్తోంది.

డ్రిప్ ఇరిగేషన్‌కు ఆదరణ గల ప్రాంతాలేవి?

జిల్లా వ్యాప్తంగా బిందుసేద్యం సాగుకు ఆదరణ లభిస్తోంది. ఇందులో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పులివెందుల, సిం హాద్రిపురం, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట తోపాటు పెండ్లిమర్రి, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో పెద్ద ఎత్తున బిందుసేద్యం ద్వారా పంటలు సాగు చేయడం కనిపిస్తోంది.

సన్మానం పొందిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కడప అర్బన్

సిద్ధవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ పదవ తరగతి విద్యార్థుల (1987-88 బ్యాచ్) సమ్మేళనం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దాదాపు 40 మంది హాజరయ్యారు. 38 సంవత్సరాల తర్వాత వీరు కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరిని ఒకరు మరోమారు పరిచయం చేసుకుంటూ వారు చేస్తున్న పనులను, ఉద్యోగాలను తెలుసుకున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, పూలదండలతో సన్మానించారు. అనంతరం గురువులు విద్యార్థినీ, విద్యార్థులను ఆశీర్వదించారు. ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా అప్పటి ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి విద్యార్థులు గురువుల పట్ల ఎంతో గౌరవంతో ఉండేవారని చెప్పారు. భయ భక్తులతో మెలుగుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవడం హర్షణీయమన్నారు. తన దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి నన్ను పిలవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్రీరాములు మాట్లాడుతూ అప్పటి సౌకర్యాలతో పోలిస్తే ప్రస్తుతం పాఠశాలలో ఎంతో అభివృద్ధి చోటుచేసుకుందని తెలిపారు. సౌకర్యాలు మెరుగుపడిన ప్రస్తుత విద్యార్థుల్లో క్రమశిక్షణ తగ్గడం ఆందోళన కలిగించే విషయమని చెప్పారు. నేటి విద్యా వ్యవస్థ టెక్నాలజీ పురోభివృద్ధితో పాటు, ప్రమాదకర పరిస్థితి కూడా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తరగతి గదిలోకి సెల్ ఫోన్స్ తీసుకురావడం ప్రమాదకరమని చెప్పారు. తల్లిదండ్రులు వీటిని ప్రోత్సహించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు గురివి రెడ్డి, సిద్ధారెడ్డి, పూర్వపు విద్యార్థుల సమ్మేళనానికి ఎంతో కృషిచేసిన డి.వి.ఎస్.ప్రసాద్ రెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వపు విద్యార్థుల జ్ఞాపకంగా పాఠశాలకు నీటి ట్యాంకును బహుకరించారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - కడప

కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో గల న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ప్రజల క్షేమభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్ , పి.రవితేజ, నరసయ్య, శాంతిరాజు, రోజా, శ్యామల, సుగుణమ్మ, లక్ష్మి, సుంక మ్మ, అక్కమ్మ, ఎల్లమ్మ, దూపం మహేష్, మీనా, పార్వతమ్మ పాల్గొన్నారు.

డిఇఒను కలిసిన ఎస్ఎల్‌టిఎ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన షంషుద్దీన్‌ను రాష్ట్ర భాషో పాధ్యాయ సంస్థ నాయకులు ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, అంకాల్ కొండయ్య, బోగా గంగాధర్, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. డిఇఒను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో స్లాట్ జిల్లా అధ్యక్షులు బీ.వీ. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గోపి, ఖాదర్ బాషా,బాబా, సుధాకర్, గురివిరెడ్డి రామచంద్రారెడ్డి, బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలకు ఇంటర్‌బోర్డ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 10 నుంచి 19 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయి. సెల్ వన్ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ఈనెల 15న స్పెల్ టు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. జనరల్ ప్రాక్టికల్ సెంటర్లు 78 ఏర్పాటు చేశారు. ఎంపిసి విద్యార్థులు 11,642 మంది, బిపిసివిద్యార్థులు 2,866 మంది ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్‌ఐఒ వెంకటసుబ్బయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కోసం సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బాండెడ్ లేబర్ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఆర్‌కె విండోస్ సొల్యూషన్, ఆర్కే విండోస్ సొల్యూషన్, దివిజ పాలిమర్స్, చౌడేశ్వరి పార్కింగ్ టైల్స్ ఇండస్ట్రీస్, సరోజినీ నగర్, బ్రిక్స్ ఇండస్ట్రీస్, కన్‌స్ట్రక్షన్ వర్కర్లకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ బాండెడ్ లేబర్ నిర్మూలన దినం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆర్టికల్ 23, సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఫర్ రిహబిలిటేషన్ ఆఫ్ బాండ్ లేబర్ 2021, బాండెడ్ లేబర్స్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. సంబంధిత అధికారులు బాండేడ్ లేబర్ సంబంధించిన పథకాలను ప్రజలలోకి తీసుకొని వెళ్లాలని చెప్పారు. అన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన, నిర్బంధ ఉచిత విద్య, బాండెడ్ లేబర్ సిస్టం చట్టం 1976 ప్రకారం అతిక్రమించిన వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష రూ. 2 వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, శైలజ, రెవెన్యూ అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్

ప్రజాశక్తి - కడప

శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం కమిటీ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్ నియమించబడ్డారు. స్థానిక ఎరముక్కపల్లె చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ కార్యవర్గ సమావేశం ఆదివారం వెలిగండ్ల లక్ష్మయ్య కాంపౌండ్ ఆవరణంలో కళ్యా సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఆలయ అధ్యక్షులుగా కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి టేకూరి పుష్పాంగధ, కోశాధికారి ఇడెం మల్లిఖార్జున, కార్యనిర్వణ కార్యదర్శిగా మోతుకూరు సుబ్బరాయుడు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కొరముట్ల సుబ్బరాయుడు, రెబ్బ హరిబాబు, టేకూరి సుదర్శన్, వెలిగండ్ల సుబ్బరాయుడు, గోవిందు వెంకటరమణ, చారు రాజ, అన్నం శంకర్,వెలిగండ్ల సుబ్బయ్య, గొరిగే బాబు, బొమ్మిశెట్టి శ్రీరాములు, ఇడెం సురేంద్ర, పల్లా వెంకటేష్, చౌడం వెంకట్ రమణ ఎన్నికయ్యారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

మంత్రితో మాట్లాడుతున్న జిడిఎస్ ఉద్యోగులు

ఫలితాలు విడుదల చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

2023 అక్టోబర్‌లో జరిగిన ఢిల్లీ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో కొన్ని ఫలితాలు మాత్రమే విడుదల చేశారని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నవాటిని విడుదల చేయాలని జిడిఎస్ ఉద్యోగులు కోరారు. ఆ మేరకు ఆదివారం పోస్టల్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిశారు. మంత్రి ఈ విషయాన్ని బాధ్యతగా స్వీకరించి అధికారులతో చర్చించారని, త్వరలోనే ఫలితాలు విడుదల చేపిస్తామని ఆయన తెలిపారని ఉద్యోగులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస బాడ్జి, ప్రదీప్, నాగరాజు, సురేంద్ర, శ్వేత, మోహన్‌రెడ్డి, నారాయణ, జిడిఎస్ ఉద్యోగులు ఉన్నారు.

మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాయలసీమ ప్రాంతంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా తన నివాసంలో ఆదివారం తిరుపేల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో అపార ఖనిజ సంపద ఉందని, ఈ ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు మైనింగ్ విశ్వవి ద్యాలయం ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. 2014 రాష్ట్ర విభజన సందర్భంగా ఇంతవరకు ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిమ్స్, రైల్వేజోన్ మరికొన్ని ఇతర ప్రాంతాలకు వెళ్లాయన్నారు. పెద్ద పరిశ్రమలు లేకపోవడం వల్ల రాయలసీమ ప్రాంతవాసులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉన్నందున రాయలసీమ ప్రాంతంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చొరవ చూపాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు కూడా చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి మైనింగ్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిరుపాల్‌రెడ్డి

అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపి రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా కూటమి ప్రభుత్వం ప్రకటించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో స్థానిక, స్థానికేతర్లకు సంబంధించి రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించారని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు 1వ జోన్‌లో, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలు 2వ జోన్‌లో, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు 3వ జోన్‌లో, కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు జిల్లాలు 4వ జోన్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. రాజధాని అమరావతి 3వ జోన్ పరిధిలోకి వస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో విద్య, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రాజధాని అన్ని ప్రాంతాలకు సంబంధించిందని, అక్కడ అన్ని ప్రాంతాల వారికి సమాన అవకాశాలు లభించాలంటే ఆ ప్రాంతాన్ని ఫ్రీ జోన్‌గా ప్రకటించడం సమంజసమని పేర్కొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు మంజూరు చేసిన గుర్తింపు కార్డులను లేబర్ ఆఫీస్ ఇన్‌ఛార్జి అల్లాబకష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పంపిణీ చేశారు. ఆదివారం వేంపల్లెలో అల్లాబకష్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ బోర్డు నుండి గుర్తింపు కార్డులు కార్మికులకు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి నాగేశ్వరరావు, దస్తగిరి, సుబ్బారావు, జమాల్‌బాషా, కిట్టయ్య, ఖాసీం, రామాంజి, శేఖర్ పాల్గొన్నారు.

కల్లూరులో వైఎస్ఆర్ విగ్రహానికి నిప్పు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలం పరిధిలోని కల్లూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. విగ్రహం పాక్షికంగా దెబ్బతింది. తెల్లవారి విషయం తెలియడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామంలో విచారణ చేపట్టిన పోలీసులు ఎవరైనా ఆకతాయిలు ఈ పని చేశారా, ఉద్దేశపూర్వకంగానే చేశారా అనే కోణంలో ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల టౌన్ :శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కోలా ప్రసాద్ సహకారంతో మాస్టర్ సూర్య, సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారు నిర్వహించిన కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ సూర్య, శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

టెంకాయ, తమలపాకు ధరలకు రెక్కలు

టెంకాయ రూ.40-రూ.50, తమలపాకుల కట్ట ధర రూ.180 - సామాన్య ప్రజలు విలవిల

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొబ్బరికాయ (టెంకాయ), తమలపాకుల ధరలు విపరీతంగా పెరిగాయి. పర్వదినాల్లో వీటిని కొనాలంటే సామాన్య ప్రజలు జంకుతున్నారు. ప్రస్తుతం మాఘమాసంలో పూజలు, వివాహాలు, గృహ ప్రవేశాలు అధికంగా చేపడుతారు. గుడికి వెళ్లాలంటే పూజా సామగ్రితోపాటు రెండు టెంకాయలు కొనాలంటే వంద చాలడం లేదు. గతంలో టెంకాయల అంగళ్లలో రూ.15 నుంచి రూ.20 వరకు ధర ఉండేది. ప్రస్తుతం కాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ.50 విక్రయిస్తున్నారు. స్థానికంగా తోటల్లో కాయలు లేకపోవడంతో కర్ణాటకలోని తుమకూరు, టిపూర్, హిరియూరు, చిత్రదుర్గ, పావగడ, గౌరీబిదనూరు తదితర ప్రాంతాల నుంచి కొబ్బరికాయలు కొని తీసుకొస్తున్నారు. తోటల వద్దనే వంద కాయలు రూ.2,500 ధర పలుకుతోందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం చలికాలంలో ఆకుల దిగుబడి అంతంత మాత్రమే ఉంటుంది. ఎండా కాలంలో ఎకరా తోటకు ఎనిమిది నుంచి పది పెండీ(100 కట్టలు ఒక పెండీ)ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం మూడు నుంచి నాలుగే వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఆకులు దిగుబడి రాకపోవడంతో మార్కెట్లో వాటి ధర గణనీయంగా పెరిగింది. పెండీ ధర రూ.16 వేల నుంచి రూ.18వేలు. వంద ఆకుల కట్ట రూ.180 ధర పలుకుతోంది. విడిగా ఒక ఆకు ధర రెండు రూపాయలకు అమ్ముతున్నారు.

కొబ్బరికాయలు, తమలపాకులు

రక్తహీనతను అధిగమించాలి

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లల్లో రక్తహీనతను అధిగమించేలా తల్లిదండ్రులు చూడాలని వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్స్) ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా ఆదివారం కేంద్రంలో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ సోమవారం జరిగే జాతీ య నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమంలో పట్టణంలో 1-19 సంవ త్సరముల పిల్లలకు తమ సమీప అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూని యర్ కళాశాలలు, ఆరోగ్య కేంద్రాలలో ఆల్బండజోల్ మాత్రలు వేస్తారని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పక మింగించి తద్వార రక్తహీనత నుండి బయటపడొచ్చు అన్నారు. ఈ మాత్రల వల్ల కలిగే ప్రయో జనాలను వివరించారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిర్డ్స్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు స్థానికులు పాల్గొన్నారు.

వేంపల్లె : నులి పురుగులు నియంత్రణపై వైద్య సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా వేంపల్లెలోని పుర వీధుల గుండా వైద్యఆరోగ్య సిబ్బంది కడుపులో ఉన్న నులి పురుగులను నివారించేందుకు మందులు వాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్వాతి సాయి, హైల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిషా మాట్లాడుతూ సోమవారం నులి పురుగుల నివారణకు అల్బెండాజోల్ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పిల్లల నుండి పెద్దల వరకు అల్బెండాజోల్ మందులు వాడవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎంపిఇఒ ఫకృద్దీన్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వేంపల్లెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

అధికారుల హామీతో ఆందోళన విరమణ

గ్రామస్తులతో మాట్లాడుతున్న యురేనియం అధికారులు

ప్రజాశక్తి - వేముల

టెయిలింగ్ పాండ్ నుంచి కలుషితమైన దుమ్ము, ధూళి మరోసారి ఆదివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున కొట్టాల గ్రామం వైపు రావడంతో ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. రెండు రోజుల క్రితం ఇలాగే కలుషితమైన దుమ్ము, ధూళి గ్రామం వైపు వీచడంతో గ్రామస్తులు ఆందోళన చేసిన విషయం విదితమే. ఆ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మళ్లీ ఆదివారం దుమ్ము, ధూళి రావడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బి2 క్వార్టర్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామస్తులతో చర్చలు జరిపారు. అధికారులు గ్రామస్తులతో కలిసి కొట్టాల గ్రామానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ గ్రామస్తులంతా కలిసి టెయిలింగ్ పాండ్ నుంచి వెలబడే దుమ్ము, ధూళిని అధికారులకు చూపించారు. నాలుగు రోజులు పాటు ప్రతిరోజు మధ్యాహ్నం గ్రామానికి వచ్చి పరిశీలిస్తామని, కొట్టాల గ్రామానికి న్యాయం జరిగిన తర్వాతనే విస్తరణ పనులు, ఇతర పనులు చేపడుతామని యురేనియం అధికారులు హామీ ఇచ్చినట్లు కొట్టాల గ్రామస్తులు తెలిపారు. హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఖాజీపేట

కడపకు చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి వారు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండి, జనరల్ సర్జన్ వైద్యులు, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డితోపాటు, పలు విభాగాల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. దాదాపు 250 మందికిపైగా రోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండి విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు ములపాకు పవన్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు విజయ్ భాస్కర్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

రమేష్‌రెడ్డి కృషి అభినందనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అవయవ దానంపై అవగాహన కల్పించేందుకు రమేష్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి దగ్గర నుండి కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వూరు గ్రాండ్, కేక్ అండ్ కాఫీ సంయుక్త ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కోసం 5కె, 3కె, 1.5కె రన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవయవ దానంపై అవగాహన కోసం కొవ్వూరు రమేశ్ రెడ్డి కొన్నేళ్లుగా విశేష కృషి చేస్తున్నారన్నారు. అవయవ దానం కోసం ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నేటి ఆధునిక ప్రపంచంలో వ్యాయామంపై దృష్టి తగ్గిందన్నారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిఎ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రన్ ఫర్ లైఫ్ నినాదంతో కొవ్వూరు రమేష్‌రెడ్డి పరుగు పందెం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాల్గొన్న క్రీడాకారులకు ధన్యవాదాలు తెలిపారు. రోటరీ క్లబ్ ద్వారా కూడా అవయవ దానంపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులు కొవ్వూరు రమేష్‌రెడ్డి మాట్లాడారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న దాదాపు 3000 మంది క్రీడాకారులకు మెడల్స్ అందించారు.

12న మాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి

ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 12న మాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి నిర్వహిస్తున్నామని ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రా భద్రాదిగా పేరు గాంచిన ఒంటిమిట్టలోని ఆది జాంబవంతుడి 50 అడుగుల విగ్రహ ప్రాంగణంలో 12న మాతంగ మహర్షి, సంత్ రవిదాస్ జయంతి నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా మడకశిర ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ ఎం.ఎస్.రాజు, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, మాతాంగ మహాపీఠం పీఠాధిపతి నూకల రవీంద్ర స్వామి విచ్చేయనున్నారని వివరించారు. పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏకశృంగ పర్వతంపై జాంబవంతుడి మహా సంస్థానం ఏర్పాటు చేయాలన్నారు. ఒంటి మిట్టకు ఏకశిలా నగరంగా నామకరణం చేయాలని టిటిడి వారిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చర్మ, డప్పు కళాకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల లక్షుమయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

రహదారుల అభివృద్ధికి తోడ్పడండి

- కేంద్ర సహాయ మంత్రిని కోరిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో రహదారులు, డ్రయినేజీ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి తోడ్పడాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆదివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్‌ను కోరారు. గుంటూరులోని మంత్రి స్వగృహంలో ఎమ్మెల్సీ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందుల సమస్యల వివరించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పం దించారని, పులివెందుల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని వారి స్వగృహంలో ఆదివారం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.12,73,438 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణ పరిధిలోని పెద్ద రంగాపురం గ్రామానికి చెందిన వివేకానందరెడ్డి యాదవ్‌కు రూ.1,06,901, ప్రశాంతి నగర్‌కు చెందిన చిన్నపల్లి నారాయణకు రూ.3,00,000, వేంపల్లి మండలం బక్కన్నగారి పల్లి గ్రామానికి చెందిన ఆవుల మహేష్ బాబుకు రూ.1,07,682, వేంపల్లి గ్రామానికి చెందిన డక్కా మునీంద్రకు రూ.1,05,425, మన్నేరు నాగమునికి రూ.76,000, తొండూరు మండలం మడూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డిగారి వీరారెడ్డికి రూ.40,000, నరెడ్డి రామాంజనేయరెడ్డికి రూ.94,957, లింగాల మండలం పెద్దకూడాల గ్రామానికి చెందిన చిత్ర నాగలింగంకు రూ.81,662, చక్రాయపేట మండలం మహదేవపల్లి గ్రామానికి చెందిన కొప్పర్తి వెంకట కొండారెడ్డికి రూ.1,80,246, నల్లగారి వెంకట్‌రెడ్డికి రూ.1,33,600, సుంకిరెడ్డి ప్రసాద్ రెడ్డికి రూ.46,965 చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, శాసనమండలి సభ్యుడు రాంగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

గంటల వ్యవధిలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆదివారం తెల్లవారుజామున మంకీ క్యాపు, చేతులకు బ్లౌజులు వేసుకొని ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆంధ్ర కేసరి రోడ్డులో నివాసముంటున్న తుమ్మల పెంట ప్రభావతిని బెదిరించి ఆమె వద్ద ఉన్న రూ.10 లక్షల విలువ చేసే 12 తులాల బంగారు తాళిబొట్టు, నాలుగు బంగారు గాజులు అపహరించిన కేసు లో పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్‌పి ఆదేశాల మేరకు పొద్దుటూరు డిఎస్‌పి ఆధ్వర్యంలో టూ టౌన్ సిఐ యుగంధర్, ఎస్ఐ జి.ధనుంజయుడు, రాఘవేంద్రరెడ్డి, కానిస్టేబుల్ రవీంద్ర నాయక్, మహబూబ్ బాషా, ఫక్రుద్దీన్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. అదే రోజు సాయంత్రం టూ టౌన్ బైపాస్ లోని మానస రెస్టారెంట్ పక్కన పొద్దుటూరు టౌన్ ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లో నివాసం ఉంటున్న ఉచ్చుస గారి వసూల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి ప్రభావతి నుంచి అపహరించిన నగలను స్వాధీనం చేసు కున్నారు. మోటర్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి తెలిపారు. నేరం జరిగిన 12 గంటలోనే నిందితుడ్ని అదుపులోకి తీసుకొని సొత్తును స్వాధీన పరుచుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిఐ, ఎస్ఐ, పోలీసులను డిఎస్‌పి అభినందించారు.

దారి దోపిడీ కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇటీవల దారి దోపిడీకి పాల్పడిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు డిఎస్‌పి వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 5న పోట్లదుర్తి గ్రామ సమీపంలో శివరామిరెడ్డిని లిఫ్ట్ ఇస్తానని బాలదాసరి యువరాజ్ ద్విచక్ర వాహనంలో ఎక్కించుకున్నాడు. రోడ్డులో ఎవరూలేని ప్రదేశానికి సదరు వ్యక్తిని తీసుకువెళ్లి బెదిరించి బంగారు ఉంగరం, సెల్‌ఫోన్ లాక్కుని యువరాజ్ పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిసి కెమెరాలు ద్వారా నిందితుడిని పట్టుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన ట్రైనీ డిఎస్‌పి భవాని, సిఐ నరేష్ బాబును ఆయన ప్రశంసించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలం తిరుమలపాడు గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు సెంట్రింగ్ పని నిమిత్తం వేంపల్లెకు వచ్చారన్నారు. ఈనెల 8న పులివెందుల రోడ్డులో తను ఉంటున్న రూం వద్ద నుండి సరుకుల తెచ్చుకొనుటకు నడుచుకొంటూ వస్తుండగా పులివెందుల వైపు నుండి పీర్ల మహమ్మద్ గౌస్ అనే వ్యక్తి మోటర్ బైకులో వచ్చి వెంకటేశ్వర్లును ఢీకొంది. గాయపడిన వెంకటేశ్వర్లును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

ఫ్యాన్‌కు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక పార్నపల్లి రోడ్డు రాజారెడ్డి కాలనీ పార్కు సమీపంలో ఉన్న ఒక ఇంటిలో దశరథ రామిరెడ్డి(22)అనే యువకుడు ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. మృతుడు కొన్నేళ్లుగా సేల్స్‌మేన్‌గా పనిచేస్తూ తల్లి దగ్గర ఉంటున్నాడు. అతనికి చాలా కాలం నుంచి ఆస్తమా ఉంది. అప్పటి నుంచి ఆరోగ్యం సరిగా లేక బాధ పడుతుండేవాడు.

వేసవి పంటల సాగులో తగ్గిన ఆసక్తి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో వేసవి సీజన్‌లో సాగు చేపట్టిన పంటలు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. రైతులు పంటల సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. కొంతమంది రైతులు మాత్రమే వరి, మినుము, వేరుశనగ, నూగు, దోస వంటి పంటలు సాగు చేపట్టారు. కెసి కెనాల్ నీరు రెండవ కారుకు వస్తున్నప్పటికీ రైతులు పంటల సాగుకు విముఖత చూపుతున్నారు. వేసవిలో ఎండ తీవ్రతకు దిగుబడులు సరిగా రావని వెనుకడుగు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా 21 వేల ఎకరాల సాగు భూమి ఉండగా.. కేవలం 3,500 ఎకరాల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. రబీ సీజన్‌కు సంబంధించి 3,350 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. వరి, మినుము, పెసర, మొక్కజొన్న, నూగు వంటి పంటలు రైతులు సాగు చేశారని తెలిపారు. 3వేల ఎకరాలకు సంబంధించి మాత్రమే రైతులు ఇకవైపి పూర్తి చేశారని తెలిపారు. రబీ సీజన్‌లో 5,349 ఎకరాలు పంటలు సాగు చేస్తారని అంచనాలు వేసినప్పటికీ పూర్తిస్థాయిలో సాగు కాలేదు. సిద్ధారెడ్డిపల్లి సోమపురం, మొద్రాయపల్లి, విశ్వనాథపురం, లక్ష్మీపేట, బద్రిపల్లి తదితర గ్రామాల పరిధిలో కెసి కాలువ కింద చాలా వరకు రెండోసారి పంటలు సాగు చేపట్టకుండా విరమించారు. కుందూ పరిధిలో సాగు చేపట్టిన వరి పంట కూడా లవణాల లోపంతో దెబ్బతింటోంది. నీరు అధికంగా నిలువ ఉండడంతో వరి పంట నశిస్తోందని శాస్త్రవేత్తలు పరిశీలించి, రైతులకు పలు సూచనలు ఇచ్చారు. దోస సాగు కూడా ఏడాది గతంలో కన్నా తగ్గుముఖం పట్టింది.

విశ్వనాథపురం రబీలో బీడుగా ఉన్న పొలాలు

CHANGE OF NAME

షేక్ బీబీ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. షేక్ దస్తగిరి సోడా బండి ఇంటి నెంబర్ 3-2-24 లో దూదేకుల వీధి బద్వేల్ పట్టణంలోని వైఎస్ఆర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటివరకు షేక్ బీబీ గా వాడుకలో ఉన్న నా పేరును ఆధార్ కార్డులో ఉన్న విధంగా షేక్ బీబీ సోడా బండి గా మార్చుకున్నాను. ఇక నుండి నా పేరు షేక్ బీబీ సోడా బండి గా గమనించగలరు.

CHANGE OF NAME

షేక్ దస్తగిరి అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. షేక్ దస్తగిరి సోడా బండి ఇంటి నెంబర్ 3-2-24 లో దూదేకుల వీధి బద్వేల్ పట్టణంలోని వైఎస్ఆర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటివరకు షేక్ దస్తగిరి గా వాడుకలో ఉన్న నా పేరును పాస్పోర్ట్ లో ఉన్న విధంగా షేక్ దస్తగిరి సోడా బండి గా మార్చుకున్నాను. ఇకనుండి నా పేరు షేక్ దస్తగిరి సోడా బండి గా గమనించగలరు.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KADAPA

E.P.No. 179 /2024

Between:

Chanda Subba Reddy S/o Chinna Sanda Reddy, aged about 44 years, residing at D.NO. 4/136, M. Choutapalli Village, Pendlimarri Mandal, YSR Kadapa District. **...Petitioner/D.Hr.**

Vs

Bareddy Yella Reddy, S/o. B. Yella Reddy, aged about 43 yrs, Hindu, Business, R/o Bareddy Palli Village, Machunuru Post, Pendlimarri Mandal, YSR District. Presently Residing at. Patha Sangatipalli Village and Post, Pendlimarri Mandal, YSR District. **...Respondent/J.Dr.**

NOTICE

Whereas the petitioner/D.Hr filed the Execution petition against the respondent/J.Dr before the Hon'ble III Additional Junior Civil Judge, Kadapa Vide E.P.NO. 179 of 2024 and the same is posted for the your appearance on 21-02-2025, all of you hereby directed to appear before the Hon'ble court at 10:30 A.M in person or through your counsel or advocate, otherwise the petition may be decided in your absence.

//By Order of the Court//

R.CHANDRA OBULA REDDY

Advocate for the Petitioner

IN THE COURT OF THE HON'BLE 2RD ADDITIONAL JUNIOR CIVIL JUDGE: KADAPA

O.S.NO: 1174 OF 2021

Chappidi Venkata Subba Reddy, Son of Chappidi Subba Reddy, residing at Door No: 9/120-A, Kapu Street, Mannuru Village, Rajampeta Mandal, Kadapa District. **...Plaintiff**

Vs

1) P.M.Anasuya Devi, Wife of Gorla Prabhakar Reddy, Daughter of late P.M.Gangi Reddy & late Pilla Manchala Narayanamma, residing at Door No: 7/22, Jaya Nagar Colony, Kadapa city.

...Defendants No.5

SUMMONS TO DEFENDANT NO: 5 UNDER ORDER 5 RULE 1 & 5 C.P.C

Where as the Plaintiff herein filed the suit against you being Defendant No: 5 for recovery of debt due under A & B marked suit Pronotes together with future interest and the suit stand posted on 12-02-2025 for your appearance therefore you being the Defendants No: 5 here by instructed to appear before the Hon'ble court on 12-02-2025 at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & P.ABBAS KHAN

Advocates for Plaintiff